క్లుప్తంగా

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచండి



పిడుగురాళ్ల: పట్టణంలోని అన్ని ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంటుందని మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్ అన్నారు. పట్టణంలో శనివారం మున్సిపల్ కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రధాన రహదారుల వెంట డ్రైన్లలో టీ కప్పులు, ప్లాస్టిక్ బాటిళ్లు, వ్యర్థాలు వేయకుండా డస్ట్‌బిన్‌లో వేయాలని సూచించారు. ప్రతి వ్యాపార సముదాయం వద్ద డస్ట్ బిన్ ఏర్పాటు చేసుకోవాలని, వ్యర్థాలన్ని డస్ట్ బిన్‌లో వేయాలని సూచించారు. మున్సిపల్ కార్మికులకు నిర్వహించాల్సిన విధివిధానాలపై అవగాహన కల్పించారు.

మాచవరం: ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలల్లో పారిశుధ్య కార్యక్రమాలు ముమ్మరంగా చేపట్టాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ డి.వెంగళరావు అన్నారు. స్వర్ణ ఆంధ్ర– స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహిస్తున్న పారిశుధ్య కార్యక్రమాలను శనివారం పర్యవేక్షించారు. పరిసరాలను పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వివేకానందలో ఆవిష్కార్ వేడుకలు



పిడుగురాళ్ల: పట్టణంలోని వివేకానంద స్కూల్‌లో ఆవిష్కార్–2025 కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వాసవీ పరమేశ్వరి దేవస్థానం కమిటీ అధ్యక్షుడు ఏలూరి చంద్రశేఖర్ మాట్లాడుతూ.. పాఠశాలలో చిన్నారులకు ప్రాక్టికల్ నాలెడ్జి ఇవ్వటం పాటు ఆరోగ్యకరమైన వాతావరణం అందించటం బాగుందన్నారు. అనంతరం చిన్నారులు రూపొందిన పలు కృత్యాలను తిలకించి, అభినందించారు. జనసేన రాష్ట్ర కార్యదర్శి మార్కండేయులు, రమేష్, వాసవీ పరమేశ్వరి దేవస్థానం ట్రెజరర్ లక్ష్మీనారాయణ, పాఠశాల డైరెక్టర్ రామకృష్ణ పాల్గొన్నారు

కొండచిలువ కలకలం



పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణ శివారు బాబు జగ్జీవన్‌రామ్ కాలనీలో కొండ చిలువ కలకలం సృష్టించిన సంఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. పిడుగురాళ్ల, జానపాడు సరిహద్దులోని కొండ ప్రాంతంలో ఉన్న జగ్జీవన్‌రామ్ కాలనీలోకి తొమ్మిది అడుగుల కొండ చిలువ ఇళ్ల మధ్యలోకి రావటంతో స్థానికులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. కాలనీలో ఉన్న యువకులు కొండ చిలువను కర్రలతో కొట్టి చంపివేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

రెంటచింతల: మండల కేంద్రమైన రెంటచింతల గ్రామ శివార్లోని గోలివాగు వద్ద 167 ఏడీ జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటన చోటుచేసుకుంది. నల్గొండ జిల్లా దామరచర్ల మండలం ఇరుగూడెంకు చెందిన కుంజా వంశీకృష్ణ ద్విచక్రవాహనంపై మాచర్ల నుంచి దాచేపల్లికి వెళ్తుండగా జాతీయ రహదారిపై అడ్డుగా పెట్టిన డ్రమ్ములు కన్పించక వాటిని ఢీకొట్టాడు. దీంతో అదుపుతప్పి కిందపడిన వంశీకృష్ణకు తల భాగాన తీవ్రగాయాలు కాగా వెంటనే గురజాల ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం మిర్యాలగూడెంకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆరవ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

దాచేపల్లి: స్థానిక ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో ఆరవ తరగతిలో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఎస్.రవికుమార్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించిన ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలని, ఎస్సీ, ఎస్టీ వర్గీయులు రూ.75, ఓసీ, బీసీలు రూ150 ప్రవేశ రుసుం చెల్లించి ఆన్‌లైన్ కేంద్రాల్లో నమోదు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 20వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని ఆయన చెప్పారు.

దుర్గి: వచ్చే విద్యా సంవత్సరానికి దుర్గి ఏపీ మోడల్ స్కూల్‌లో 6వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పి.బాలస్వామి శనివారం తెలిపారు. ఈ నెల 24 నుంచి మార్చి 31వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా పరీక్ష రుసుమును చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాల కోసం 9160649929, 9440726818 నెంబర్లను సంప్రదించాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

శివారు సమస్యలు కనరూ..!



కొత్తపల్లి కాలనీలో విపరీతంగా పెరిగిన పిచ్చి మొక్కలు



రోడ్డుంది.. డ్రైనేజీ ఏదీ..?

- మురుగు కాల్వలు లేక ఇళ్లముందే నిలిచిపోతున్న వాడుక నీళ్లు
- ఖాళీ స్థలాల్లో అడవులను తలపిస్తున్న పిచ్చిమొక్కలు
- వేసవి రాకముందే తాగునీటికి తీవ్ర ఇబ్బందులు
- మాచర్లలోని కొత్తపల్లి కాలనీ, ఆజాద్ నగర్, వినాయకుని గుట్ట, చెన్నకేశవుని నగర్ తదితర శివారు ప్రాంతాల్లో దుస్థితి

మాచర్ల: పట్టణంలోని శివారు కాలనీయైన కొత్తపల్లి కాలనీలో పలు సమస్యలు వెంటాడుతున్నాయి. ఈ కాలనీతో పాటు రోప్‌వే కాలనీలోని షాలోం చర్చి ప్రాంతంతో పాటు ఆజాద్ నగర్, వినాయకుని గుట్ట, చెన్నకేశవుని నగర్‌లో మంచినీటితో పాటు అనేక మౌలిక సదుపాయాలకు ఇబ్బందిగా మారింది. ఇప్పటికే 8వ వార్డులోని బోరు మరమ్మతులకు గురికాగా మంచినీటి సమస్యతో ఆ ప్రాంత వాసులు ఇళ్ల ముందు డ్రమ్ములు ఏర్పాటు చేసుకొని నీళ్లు పట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. శివారు కాలనీలో పలు చోట్ల ఇదే పరిస్థితి నెలకొంది. ఎండాకాలం రాకముందే ఈ పరిస్థితితో శివారు ప్రాంతంలో ఇబ్బందులున్నాయి.

తాగునీటికి కటకట

కొత్తపల్లి శివారు కాలనీలో ముళ్లపొదలు పెరిగి కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లు వేసినా, మురుగు కాల్వలు నిర్మించలేదు. అదేవిధంగా మంచినీటి సమస్య నిరంతరం వెంటాడుతుంది. పురపాలక సంఘానికి దూరంగా ఉన్న ఈ కాలనీల విషయంలో న్యాయం జరగటం లేదు. దీంతో ఆ ప్రాంత నివాసులు ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నా అవి సరిపోక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. పలు సార్లు అధికారులు, ప్రజా ప్రతినిధులను కలిసినా వారి సమస్యలు శాశ్వతంగా పరిష్కారం కాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

అందరూ పేదలే..

శివారు కాలనీల్లో అందరూ కూలి, చిన్న చిన్న పనులు, చిన్న ఉద్యోగాలు చేసుకునే పేదవారే. అధికారులు పట్టణంలోని ఇతర ప్రాంతాల వద్ద సౌకర్యాల కల్పనకు మొగ్గు చూపుతున్నారని, తమ ప్రాంతాల్లో కనీస వసతులు కల్పించడంలో విఫలమవుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 8వ వార్డులో బోరు సైతం మరమ్మతులకు గురై నెలలు గడుస్తున్నా పట్టించుకునే వారే లేరని వాపోతున్నారు. తమ ఇళ్ల మధ్య ఉన్న ఖాళీ స్థలాల్లో విపరీతంగా పిచ్చిమొక్కలు పెరిగి విషపురుగులకు ఆవాసంగా మారాయని ఆవేదనవ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ కాలనీల్లో మంచినీటి సమస్య పరిష్కరించాలని, అదేవిధంగా మురుగు కాల్వల ఏర్పాటు పై దృష్టి సారించి న్యాయం చేయాలని ఆయా ప్రాంత వాసులు కోరుతున్నారు.



రోప్‌లైన్ కాలనీలో మరమ్మతుకు గురైన బోరు

మా కాలనీలో అన్నీ సమస్యలే..



2005లో మా కాలనీలో 274 మందికి ఇళ్ల పట్టాలు మంజూరు చేశారు. ఎంతో మంది ఇళ్లు నిర్మించుకొని ఇక్కడే నివాసముంటున్నాం. పట్టణ శివారులో ఉంటున్న మాకు అన్నీ సమస్యలే. తాగేందుకు మంచినీరు లేదు, మురుగు కాలువలు లేవు, పారిశుధ్య పనులు అసలు జరగడం లేదు. మా సమస్యలను గుర్తించి పరిష్కరించాలి.

– తిరివీధి అంకారావు, కొత్తపల్లి కాలనీ

మంచినీటి సమస్యతో అల్లాడుతున్నాం



8వ వార్డులోని రోప్ లైన్ కాలనీలో మంచినీటి సమస్యతో అల్లాడుతున్నాం. మా ప్రాంతంలో ఉన్న బోరు మరమ్మతుకు గురై చాలా నెలలైంది. ఇప్పటికీ మరమ్మతు చేయటం లేదు. మున్సిపాలిటీ వారు ట్యాంకర్లు పంపుతున్నా చివరి దాకా మాకు నీళ్లు అందటం లేదు. నీళ్లకు అవస్థ పడుతూ కూలి పనులకు వెళ్లలేక ఇబ్బందులకు గురవుతున్నాం,

– బత్తుల ఆదిలక్ష్మి, 8వ వార్డు

పల్నాడుకు ప్రత్యేక గుర్తింపు తెచ్చిన కన్నెగంటి

దుర్గి: తెలుగు నేలపై ఎందరో సమరయోధులు స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేశారని, వారిలో పల్నాడు ప్రాంతానికి చెందిన కన్నెగంటి హనుమంతు ఉండటం మనందరికీ గర్వకారణమని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రమైన దుర్గి బస్టాండ్ సెంటర్‌లో కన్నెగంటి హనుమంతు 103వ వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం కోసం తన ప్రాణాలను లెక్కచెయ్యక అసువులు బాసిన వీరుడు హనుమంతుకు నివాళులర్పించటం మనందరి బాధ్యత అన్నారు. త్వరలో కోలగుట్ల సమీపంలో కన్నెగంటి ఘాట్ వద్ద ఆయన విగ్రహాన్ని ఆవిష్కరిస్తామన్నారు. ఈ సందర్భంగా విగ్రహదాత శంభు శ్రీనివాసరావుకు అభినందనలు తెలిపారు. అనంతరం పులిహోర పంపిణీ చేశారు. ఎంపీపీ యేచూరి సాయిశంకర్, కూటమి నేతలు పాల్గొన్నారు.

ఆదర్శనీయుడు కన్నెగంటి హనుమంతు

మాచర్ల: పుల్లరి యోధుడు స్వర్గీయ కన్నెగంటి హనుమంతు జీవితం అందరికీ ఆదర్శమని మార్కెట్ యార్డు మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ జిల్లా నాయకుడు యరబోతుల శ్రీనివాసరావు అన్నారు. శనివారం పట్టణంలోని బస్టాండ్ సెంటర్‌లో ఉన్న కన్నెగంటి హనుమంతు విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కన్నెగంటి హనుమంతు పల్నాటి ప్రజల కోసం ప్రాణాలర్పించిన మహనీయుడని అయన అన్నారు. వైఎస్సార్ సీపీ బీసీ సంఘం నాయకుడు పాదిలి అంజి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ నవక్రాంతి పార్టీ ఆధ్వర్యంలో...

గురజాల: పుల్లరియోధుడు కన్నెగంటి హనుమంతు వర్ధంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించకపోవడం శోచనీయమని నేషనల్ నవక్రాంతి పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు కనకం శ్రీనివాసరావు అన్నారు. ఆయన తన కార్యాలయంలో శనివారం కన్నెగంటి హనుమంతు 103వ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిటిష్ సామ్రాజ్య వాదులపై వీరోచిత పోరాటం చేసిన కన్నెగంటి సేవలు భావితరాలకు ఆదర్శమన్నారు. ముందుగా కన్నెగంటి హనుమంతు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



కన్నెగంటి హనుమంతు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే జేబీఆర్



కన్నెగంటి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న యరబోతుల శ్రీనివాసరావు

కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోండి

రెంటచింతల: మండలంలోని వివిధ గ్రామాలలో కంది సాగు చేస్తున్న రైతులు స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకుని పంటను విక్రయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి కోరారు. శనివారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఏపీ మార్క్‌ఫెడ్, నాఫెడ్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం రైతుల శ్రేయస్సుకోసం కందుల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసిందన్నారు. ఈ కొనుగోలు కేంద్రం ద్వారా పంట నమోదు చేసుకున్న ప్రతి రైతు నుంచి మాత్రమే మద్దతు ధర రూ.7,550లకు కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. చిన్న, సన్నకారు రైతులకు అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. రైతులకు బ్యాంక్ ఖాతాలకు నేరుగా 10 రోజులలోపే నగదును చెల్లించడం జరుగుతుందని వెల్లడించారు.



ఏఓ బోయపాటి బ్రహ్మారెడ్డి

డీఎస్సీ నోటిఫికేషన్ సత్వరం విడుదల చేయాలి

మాచర్ల రూరల్: కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వ పాఠశాలలో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను వెంటనే భర్తీ చేసేందుకు డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని సీపీఐ ఏరియా కార్యదర్శి మేకపోతుల శ్రీనివాసరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం తహసీల్దార్ కిరణ్ కుమార్‌కు వినతి పత్రం అందించి ఆయన మాట్లాడారు. ఎన్నికలలో ఓట్లు, సీట్లు కోసం హామీలిచ్చి ప్రభుత్వం ఏర్పడి 8 నెలలు దాటుతున్నా నేటికీ హామీలు అమలు చేయకపోవడం దారుణమన్నారు. అధికారంలోకి రాగానే చంద్రబాబు తొలిసంతకం డీఎస్సీ నోటిఫికేషన్ అని చెప్పి.. తీరా ఇప్పుడు ఆలస్యం చేస్తూ నిరుద్యోగులను నిండా ముంచారన్నారు. ఏఐవైఎఫ్ నియోజకవర్గ కార్యదర్శి నర్రా రంగ స్వామి, సీపీఐ పట్టణ కార్యదర్శి మిద్దెపోగు బాబురావు, కాల శివయ్య, ఎంసీపీఐ ఏరియా కార్యదర్శి అబ్రహం లింకన్, వరికపూడిసెల సాధన సమితి అధ్యక్షుడు పల్నాడు శ్రీనివాసరావు తదితరులున్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ ఏరియా కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, నాయకులు

నేడు పూర్ణాహుతి

మాచర్ల: మండల పరిధిలోని జమ్మలమడకలో వేంచేసియున్న కురుమరేళ్ళమ్మ అమ్మవారి దేవస్థాన ఆవరణంలో ఉదయం 9.11గంటలకు యజ్ఞం, అనంతరం పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించనున్నట్లు అఖిల విశ్వ గాయత్రి పరివార్ – శాంతికుంజ్ – హరిద్వార్ సభ్యులు తెలిపారు. యజ్ఞంలో ఉపనయనంతో పాటు శుభాకార్యక్రమాలను నిర్వహించటం జరుగుతుందన్నారు. భక్తులు హాజరై యజ్ఞం, పూర్ణాహుతి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

ఘనంగా ఇవాంజిలికల్ చర్చి వార్షికోత్సవం



మాచర్ల: పట్టణంలోని సొసైటీ కాలనీ ప్రాంతంలో ఉన్న లాయల్ ఇవాంజిలికల్ ఫెలోషిప్ చర్చి 7వ వార్షికోత్సవ మహాసభలను స్థానిక వీవీఆర్ గార్డెన్స్‌లో శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా రెవ.డాక్టర్ కె.దానియేలు శ్యాంబాబు హాజరై, దైవసందేశం అందించారు. ఏసుక్రీస్తు బోధనలను ప్రతి ఒక్కరూ అనుసరించాలన్నారు. చర్చి వార్షికోత్సవం జరుపుకోవటం అభినందనీయమన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వందలాది మంది ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ప్రేమ విందు నిర్వహించారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన

గురజాల: ఈ నెల 27న జరగనున్న గుంటూరు – కృష్ణా జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా పోలింగ్ బూత్‌లను శనివారం అధికారులు పరిశీలించారు. నగర పంచాయతీ పరిధిలోని పలు బూత్‌లను రెవెన్యూ డివిజనల్ అధికారి మురళీకృష్ణ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పోలింగ్ బూత్‌ల్లో మౌలిక వసతులు కల్పించేవిధంగా చూడాలన్నారు. ఎటువంటి ఇబ్బందులు రాకుండా చర్యలు చేపట్టాలన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. తహసీల్దార్ కె.నగేష్, నగర పంచాయతి కమిషనర్ వైవీఎస్‌వీ శివన్నారాయణ రావు, సీఐ ఆవుల భాస్కర్ తదితరులున్నారు.

ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

శావల్యాపురం: అధికారుల సమన్వయంతో పని చేస్తూ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీపీ సుహాసిని మాట్లాడుతూ రానున్న వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా అధికారుల భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలు రూపొందించుకోవాలని తెలిపారు. అన్ని గ్రామాల్లో చేతిపంపులు పని చేసేలా చర్యలు తీసుకోవాలని, మంచి నీటి చెరువులను సాగర్ జలాలతో పూర్తిస్థాయిలో నింపాలని కోరారు. గ్రామాల్లో ప్రజలకు అధికారులు నిరంతరం అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కార దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం జనవరి 26న జిల్లా కలెక్టరు పి.అరుణ్‌బాబు నుంచి ఉత్తమ ఏపీఎంగా ప్రశంసా పత్రం అందుకున్న గుమ్మడిల్లి వాసుబాబును ప్రజాప్రతినిధులు, అధికారులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు పారా హైమావతి, వైస్ ఎంపీపీలు చెన్నంశెట్టి రంగారావు, నంబూరి ప్రభావతి, ఎంపీడీవో పేరమీనా సీతారామయ్య, మండల కోఆప్షన్ సభ్యులు దూదేకుల హుస్సేన్, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఏపీఎం వాసుబాబు సత్కరిస్తున్న ఎంపీపీ, అధికారులు

తిరునాళ్ల ఏర్పాట్లు పరిశీలన

బొల్లాపల్లి : నల్లమల అటవీ ప్రాంతంలోని ప్రకాశం–గుంటూరు జిల్లా సరిహద్దులో గల శ్రీ లక్ష్మీనరసింహస్వామి తిరునాళ్ల ఏర్పాట్లను దేవాదాయ శాఖ అధికారులు శనివారం పరిశీలించారు. మహా శివరాత్రిని పురస్కరించుకొని స్వామి కల్యాణ మహోత్సవం నిర్వహించడం ఇక్కడి విశిష్టత. జిల్లా దేవదాయ శాఖ అధికారి ఎ.అచ్యుత వెంకట్ ఆలయాన్ని సందర్శించి తిరునాళ్ల సందర్భంగా జరుగుతున్న పనులను పర్యవేక్షించి పలు సూచనలు చేశారని స్థానిక ఈవో ఎ.శ్రీనివాసరెడ్డి తెలిపారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు.



తిరునాళ్ల ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఈఓ తదితరులు

పారిశుద్ధ్య నిర్వహణలో అశ్రద్ధ వద్దు

డీపీఓ విజయభాస్కర్‌రెడ్డి

నాదెండ్ల: మండలంలోని సాతులూరు గ్రామ పంచాయతీని శనివారం జిల్లా పంచాయతీ అధికారి విజయభాస్కర్‌రెడ్డి సందర్శించారు. పారిశుద్ధ్య కార్మికులు, పంచాయతీ సిబ్బందితో సమావేశమయ్యారు. గ్రామంలో చెత్త సేకరణ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణను పక్కాగా చేయాలని చెప్పారు. ఇండ్ల నుంచిచెత్త సేకరణను చిత్తశుద్ధితో చేయాలని తెలిపారు. వాహనాల ద్వారా సేకరించిన చెత్తను గ్రామ శివారుల్లో పడవేయకుండా డంపింగ్ యార్డుకు తరలించాలని ఆదేశించారు. కాలువల్లో మురుగునీరు పారుదల లేక దోమలు పెరిగి, అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని తెలిపారు. బ్లీచింగ్, సున్నం చల్లాలని సూచించారు. వ్యాధులు ప్రబలకుండా పూర్తి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయన వెంట డీఎల్‌పీవో లక్ష్మణరావు, పంచాయతీ కార్యదర్శి రాఘవయ్య ఉన్నారు.



పనులు పరిశీలిస్తున్న డీపీఓ

మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి

దాచేపల్లి: విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలని ఎంఈఓ పినాకపాణి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ పదో తరగతి విద్యార్థులకు శనివారం ఫేర్‌వెల్ కార్యక్రమం నిర్వహించారు. ఎంఈఓ పినాకపాణి మాట్లాడుతూ.. దాచేపల్లి హైస్కూల్‌కి జిల్లా వ్యాప్తంగా మంచిపేరు ఉందని, ఇక్కడ చదువుకున్న విద్యార్థులు అన్ని రంగాల్లో ఉన్నతమైన స్థానాల్లో స్థిరపడ్డారన్నారు. హైస్కూల్‌కి మరింత పేరు తెచ్చేలా విద్యార్థులు పరీక్షలు రాసి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. హెచ్ఎం శ్రీనివాసరావు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ హఫీజ్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

కొత్త ధాన్యంతో పొంగళ్ల నైవేద్యం

నేడు అంకమ్మతల్లి తిరునాళ్ల

రాజుపాలెం: రాజుపాలెంలో కొలువుదీరిన అంకమ్మతల్లి కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి, భక్తుల పాలిట కొంగుబంగారం. ఈ ఆదిపరాశక్తికి శతాబ్ద కాలం నుంచి ఏటా ఫిబ్రవరి ఆఖరి ఆదివారం (23వ తేదీ) అత్యంత వైభవంగా తిరునాళ్ల జరుగుతుంది. కారంపూడి వీర్ల దేవాలయంలోని వీరుల ఆయుధాల (దైవాలను)ను తిరునాళ్ల ముందు రోజు (శనివారం రాత్రి) తీసుకువచ్చి పురవీధుల్లో ఊరేగిస్తూ సేవ చేస్తారు. పాడిపంటలు, భోగ భాగ్యాలతో చల్లగా చూసే తల్లికి తొలి ధాన్యపు కంకుల పొంగళ్లు నైవేద్యంగా సమర్పించి చీర, సారెలతో వాయిద్యాల నడుమ మొక్కులు తీర్చుకుంటారు. మహిళలు ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి బోనాలు సమర్పిస్తారు. సాయంత్రం 4 గంటల నుంచి విద్యుత్ ప్రభలు, కోలాటాలు, భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలతో రాత్రంతా జాగారం చేస్తారు.

ఉత్సవాలకు సిద్ధం

ఈ ఏడాది ఉత్సవాలను ఎంతో వైభవంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లను సిద్ధం చేశారు. దేవాలయాన్ని వివిధ రంగులతో, విద్యుత్ దీపాలతో అలంకరించారు. అంకమ్మతల్లి బ్రహ్మోత్సవాలు త్రయాహ్నిక దీక్షతో అత్యంత వైభవంగా నిర్వహించడం ఇక్కడ ఆచారం. అమ్మవారిని దర్శించి తీర్థ ప్రసాదాలను స్వీకరించాలని అర్చకులు అర్వపల్లి ఫణికేశవ శర్మ కోరారు.

మంచికల్లు ప్రధాన రహదారి పనులు పూర్తి

రెంటచింతల: మండలంలోని మంచికల్లు గ్రామంలో రూ.15 లక్షలతో చేపట్టిన ప్రధాన రహదారి అభివృద్ధి పనులు పూర్తయినట్లు ఆర్అండ్‌బీ ఏఈఈ యూసఫ్ శనివారం తెలిపారు. నూతన రహదారుల అభివృద్ధి పనుల నిమిత్తం సీఐఆర్ఎఫ్ పథకం కింద మాచర్ల నియోజక వర్గానికి రూ.117.70 కోట్లు నిధులు విడుదల అయ్యాయన్నారు. పాలువాయి గేటు అడ్డరోడ్డు వద్ద నుంచి మంచికల్లు గ్రామం వరకు మరో రూ.35 లక్షల నిధులతో చేపట్టిన మరమ్మతులు కూడా పూర్తి చేయడం జరిగిందన్నారు. పాలువాయి జంక్షన్ నుంచి సత్రశాల వరకు ఉన్న రహదారితో పాటు నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి ఇతర గ్రామాలకు వెళ్లే రహదారుల మరమ్మతులు కూడ పూర్తయ్యాయన్నారు.

రైతులకు ఈ కేవైసీ తప్పనిసరి

నకరికల్లు: వ్యవసాయ సంక్షేమ పథకాలు రైతులకు అందేందుకు ఈ కేవైసీ తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు రైతులకు సూచించారు. మండలంలోని చీమలమర్రి గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో శనివారం రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫార్మర్ ఈ కేవైసీ నమోదుకు ఈ నెల 25వ తేదీతో గడువు ముగుస్తుందని అన్నారు. అన్ని గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో ఫార్మర్ రిజిస్టర్ ఐడీ నంబర్‌ను రైతులకు జారీ చేస్తామన్నారు. రిజిస్టర్ ఐడీ నంబర్ పొందేందుకు పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్ జిరాక్స్, ఆధార్‌కు లింక్ చేయబడిన ఫోన్ నంబర్‌తో రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకుడు జి.జగదీష్, రైతులు పాల్గొన్నారు.



రైతులకు సూచనలిస్తున్న ఏఓ కె.దేవదాసు

కంటి వైద్య శిబిరం

గురజాల రూరల్: విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యాలయంలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం వరకు బిరం నిర్వహించారు. టీడీపీ పట్టణ కన్వీనర్ అడపా శ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీ శరమాళ్ల హనుమంతరావులు ప్రారంభించారు. నరసరావుపేట రామలింగారెడ్డి మ్యాక్స్ విజన్ ఆధ్వర్యంలో శిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. జిల్లా వైస్ ప్రెసిడెంట్ సత్యనారాయణ చేతుల మీదుగా పెన్షనర్ గుర్తింపు కార్డులు మంజూరు చేశారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

వైభవంగా దర్గా ఉరుసు మహోత్సవం

నాదెండ్ల: విశ్వాన్ని సృష్టించిన సృష్టికర్త ఒక్కడేనని, సాటి మానవుల సేవతోనే ఆ భగవంతుని ప్రసన్నత పొందవచ్చనదే హజరత్ మహబూబ్ సుభాని బోధనల సారాంశమని దర్గా కమిటీ సభ్యులు చెప్పారు. అప్పాపురంలోని హజరత్ మహబూబ్ సుభాని బాబా దర్గా 18వ ఉరుసు మహోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి, మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆదివారం గంధ మహోత్సవం నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.